

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	203	231
సూర్యాపేట	రూ.130	190	220
నల్లగొండ	రూ.146	210	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 23.6



వేసవిలో తాగునీటి ఎద్దడిని తట్టుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గిపోవడం, భూగర్భజలాలు అడుగంటిన నేపథ్యంలో రానున్న మూడునెలల పాటు నీటికొరత లేకుండా చూసేందుకు మిషన్‌భగీరథ యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

నీటి కొరత రాకుండా!

- తాగునీటి సరఫరాకు అధికారయంత్రాంగం కసరత్తు
- జూన్ నెలాఖరు వరకు మిషన్‌భగీరథకు నీటి కొరతలేదని స్పష్టత
- వేసవి యాక్షన్ ప్లాన్ కూడా రెడీ
- నల్లగొండ జిల్లాలో నెలకు అర టీఎంసీ నీటి వినియోగం

నల్లగొండ జిల్లాలో తొమ్మిది మునిసిపాలిటీలు, 1,744 గ్రామీణ ఆవాసాలకు కలిపి తాగునీటి అవసరాల నిమిత్తం నెలకు అర టీఎంసీ చొప్పున జూన్ నెలాఖరు వరకు మొత్తం 1.50టీఎంసీల నీటి వినియోగం ఉంటుందని అధికారులు అంచనా వేసి, ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఓ వైపు తాగునీటి అవసరాలకు కృష్ణా జలాలను సరఫరా చేసే మిషన్‌భగీరథ పథకానికి నీటి కొరత లేకుండా చూడటంతోపాటు, మరోవైపు ప్రత్యామ్నాయ వనరుల ద్వారా తాగునీటి సరఫరాకు జిల్లా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొనే నిమిత్తం రాష్ట్ర వ్యాప్తంగా కేటాయించిన రూ.100కోట్ల నిధుల్లో జిల్లాకు రూ.5.35కోట్లు రాగా, ఆ మేరకు ప్రత్యామ్నాయ పనులు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో నీటినిల్వలు



జిల్లాలో మిషన్‌భగీరథ ద్వారా తాగునీటిని అందించేందుకు అవసరమైన కృష్ణా జలాలు ఉన్నాయని అధికార యంత్రాంగం చెబుతోంది. తొమ్మిది మునిసిపాలిటీలు, 1,744 ఆవాసాలకు పానగల్ రిజర్వాయర్, టెయిల్‌పాండ్ డ్యామ్, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయ ర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నల్లగొండలో మూడు, అవంతీపురం, భక్తళాపురం, వాడపల్లి, బాలెంల, కోదండాపురం, అడవిదేవులపల్లి, పజ్జూరు, పెద్దదేవులపల్లిలోని వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధ జలాలను ఈ ఆవాసాల్లోని ఇంటింటికీ నల్లాల ద్వారా అందిస్తున్నారు. మొత్తం జిల్లాకు ప్రతి నెలా సుమారు 0.50టీఎంసీల నీటిని వినియోగించాల్సి ఉంటుందని, ప్రస్తుతం ఈ మూడు రిజర్వాయర్లలో జూన్ నెలాఖరు వరకు తాగునీటికి అవసరమైన నిల్వలు ఉన్నందున నీటి సరఫరాకు ఢోకాలేదని అధికారులు చెబుతున్నారు.

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా

జిల్లాలో తాగు నీటిఎద్దడి ఏర్పడకుండా నివారించేందుకు, రానున్న మూడునెలల్లో ఎలాంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేలా అధికారులు ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలు చేస్తున్నారు.నీటి ఎద్దడిని నివారించే నిమిత్తం జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5.35కోట్ల నిధులు వచ్చాయి. ఈ నిధులతో అన్ని ఆవాసాల్లో గ్రామపంచాయతీ ఆధీనంలోని చేతిపంపులు, మోటర్లకు మరమ్మతులు చేయించడంతో పాటు, పైప్‌లైన్లను సరిచేస్తున్నారు. అందుకోసం ఈ నెల 7నుంచి 15వ తేదీ వరకు జిల్లాలో మిషన్‌భగీరథ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తించిన 486 చేతిపంపులకు ఇప్పటికే 421 పంపులను మరమ్మతు చేయగా, ఒక హెచ్‌పీ సామర్థ్యం ఉన్న 327 మోటార్లు మరమ్మతుకు గురికాగా, అందులో ఇప్పటివరకు 285 మోటార్లు సిద్ధమయ్యాయి. 3హెచ్‌పీ సామర్థ్యం ఉన్న 562 మోటార్లకు 499 సిద్ధమయ్యాయి. వీటితో పాటు 3,000 పైప్‌లైన్ లీకేజీలు గుర్తించగా, ఇప్పటివరకు 2,445 లీకేజీలను సరిచేయగా, మిగిలిన మరమ్మతులు కూడా త్వరలో పూర్తిచేయిస్తామని అధికారులు చెబుతున్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే రైతుల బోరుబావులను అద్దెకు తీసుకొని కూడా నీటిని సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా అధికారులు చేపట్టారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా చర్యలు



జిల్లాలో తాగునీటి సరఫరా నిమిత్తం జూన్ నెలాఖరు వరకు అవసరమైన నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ప్రతీ ఇంటికి శుద్ధిచేసిన నీటిని అందించే ప్రక్రియలో ఎక్కడా లోటులేకుండా చూస్తున్నాం. కృష్ణా జలాల సరఫరాలో ఆటంకం తలెత్తినా నీటి ఎద్దడి ఉండకుండా చూడాలనే ప్రభుత్వ ఆదేశం మేరకు జిల్లాలో వేసవి యాక్షన్ ప్లాన్ అమలుచేస్తున్నాం. ప్రతీ ఆవాసంలో ఉన్న చేతిపంపులు, మోటర్లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తెస్తున్నాం. అవసరమైతే రైతుల బోర్లను కూడా అద్దెకు తీసుకుంటాం.
- వెంకటేశ్వర్లు, ఎస్ఈ, మిషన్‌భగీరథ

తాగు నీటి కొరత రాకుండా చూడాలి

- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

నల్లగొండ టౌన్, మార్చి 26: తాగు నీటి సమస్య ఉత్పన్నం కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. వేసవి దృష్ట్యా ప్రజలు తాగు నీటి ఎద్దడిని ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. 2023-24 యాసంగి ధాన్యం కొనుగోలుకు వెంటనే కేంద్రాలను ప్రారంభించాలని, రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ రోజు ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించాలని, అన్ని కేంద్రాలకు ఇన్‌చార్జీలను గుర్తించడంతోపాటు, ఎక్కడెక్కడ ప్రారంభిస్తున్నారో ప్రాంతాలతో సహా, నివేదిక రూపొందించాలని ఆదేశించారు. కలెక్టర్ దాసరి హరిచందన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలతో పాటు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు వివరించారు. తాగునీటిని సరఫరా చేసే పథకాలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడంతోపాటు అవసరమైన చోట చేతి పంపుల మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 370 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, 5.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని అంచనా వేశామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలీన్లు, ధాన్యాన్ని శుభ్రం చేసే ప్యాడీ క్లీనర్లు, తూకం యంత్రాలు అన్నింటిని సిద్ధం చేశామని తెలిపారు. 2023 వానాకాలం కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్)కు సంబంధించి రైస్ మిల్లర్లతో తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్దేశించిన సమయంలో సీఎంఆర్‌ను పూర్తి చేస్తామని వివరించారు.



సరిపడా రాని తాగునీరు

యాదాద్రి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వేసవికి ముందే జిల్లాలో తాగునీటి ఎద్దడి ముంచుకొస్తోంది. వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాలు అడుగంటాయి. జిల్లాలో మిషన్ భగీరథ పథకం ద్వారా సరిపడా రాకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. యాదాద్రి జిల్లాలో మొత్తం 421పంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలు ఉన్నాయి. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లోని 549 ఆవాసాలకు హైదరాబాద్ మెట్రోవాటర్ సప్లయ్ ద్వారా నీరుసరఫరా అవుతోంది. రోజువారీగా 70 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ పర్‌డే) నీరు అవసరం కాగా, ప్రస్తుతం 34ఎంఎల్‌డీలు మాత్రమే సరఫరా అవుతున్నాయి. చౌటుప్పల్, నారాయణపూర్, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాల్లోని 144 ఆవాసాలకు అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటిని సరఫరాచేస్తున్నారు. రామన్నపేట, మోత్కుర్, అడ్డగూడూరు మండలాల్లోని 76ఆవాసాలకు పానగల్ రిజర్వాయర్ నుంచి కృష్ణానీటిని అందిస్తున్నారు. అయితే ప్రజలకు సరిపడా తాగునీరు రావడం లేదు. దీంతో స్థానికంగా ఉన్న బోరుబావుల్లోని నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారు. మునిసిపాలిటీల్లో మూడురోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతోంది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.





సాలార్‌జంగ్‌పేటలో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్న మునిసిపల్ సిబ్బంది

నీటి కోసం అల్లాడుతున్న కోదాడ

- పెరుగుతున్న జనాభాకు నిత్యం 12 ఎంఎల్‌డీ నీరు అవసరం
- మిషన్ భగీరథ, మునిసిపాలిటీ ద్వారా 7ఎంఎల్‌డీలు మాత్రమే సరఫరా

కోదాడ, మార్చి 26: మండుతున్న ఎండలకు తోడు భూగర్భజలాలు అడుగంటడం, బావులు, బోర్లు పనిచేయకపోవడంతో కోదాడ పట్టణవాసులు తాగు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో 35వార్డులు ఉండగా, 83వేల జనాభా ఉంది. జనాభా అవసరాల కోసం నిత్యం 12ఎంఎల్‌డీ (మెగా లీటర్స్ పర్‌డే) నీరు కావాలి. కాగా, మిషన్ భగీరథ, మునిసిపాలిటీ నిత్యం 7ఎంఎల్‌డీ నీటిని మాత్రమే సరఫరా చేస్తోంది. మరో 5ఎంఎల్‌డీ నీటి కొరత ఉంది. మార్చిలో పరిస్థితి ఇలా ఉంటే వచ్చే మూడు నెలలు ఏంటని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మునిసిపాలిటీ రెండు ట్యాంకర్ల ద్వారా పలు కాలనీలకు నీటి సరఫరా చేస్తోంది. ప్రధానంగా పట్టణంలోని నయానగర్, శ్రీనగర్, శ్రీమన్నారాయణ, సాలార్‌జంగ్‌పేట, కోమరబండ కాలనీ వాసులు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ.1కోటి విడుదల

గత ఏడాది వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటాయి. బోర్లు, బావులు ఎండిపోవడంతో నీటి సమస్య అధికమైంది. పట్టణంలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే మిషన్‌భగీరథ అధికారులతో మాట్లాడాం. వేసవిలో మరో 5ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాలని కోరాం. నీటి సమస్య ఉన్న కాలనీలకు అదనపు పైప్‌లైన్లు, బోర్లు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. అందుకు రూ.1కోటి నిధులు విడుదలయ్యాయి. అదే విధంగా మరో మూడు ట్యాంకర్ల ద్వారా పట్టణవాసులకు తాగునీటి సరఫరా చేస్తాం.
- రమాదేవి, కోదాడ మునిసిపల్ కమిషనర్

బీజేపీలో ఎంపీ టికెట్ ముసలం

- నల్లగొండ అభ్యర్థి సైదిరెడ్డిని మార్చాలంటున్న వ్యతిరేక వర్గం
- చిన్నపరెడ్డికి టిక్కెట్ ఇస్తే బలమైన అభ్యర్థవుతారని ప్రతిపాదన
- అధిష్ఠానం పునరాలోచిస్తోందంటున్న నేతలు

నల్లగొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): బీజేపీ నల్లగొండ ఎంపీ సీటు విషయంలో ఆ పార్టీలో ముసలం మొదలైంది. నల్లగొండ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని మార్చాలని పార్టీ నాయకులు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. బీఆర్ఎస్‌కు ఇటీవలే రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డిని పార్టీలో చేర్చుకొని టికెట్ ఇవ్వాలనే ప్రతిపాదన తెరమీదకు తెస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డిని వ్యతిరేకిస్తున్న బీజేపీ నాయకులు తాజాగా, మరోసారి పార్టీ ముఖ్యనేతలను కలిసి అభ్యర్థిని మార్చాలని కోరడం చర్చనీయాంశమైంది.

సైదిరెడ్డిని వ్యతిరేకిస్తున్న కీలకనేతలు

గెలుపే లక్ష్యంగా బీజేపీ నల్లగొండ లోక్‌సభ సీటును పార్టీ సంప్రదాయ నేతలను కాదని, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డికి కేటాయించింది. ఇతర సీట్లలోనూ వలస నేతలకు టికెట్లు ఇచ్చినా, ఎక్కడా రాని వ్యతిరేకత నల్లగొండ టికెట్ విషయంలో మాత్రం ఎదురవుతోంది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గుర్రంబోడు భూముల విషయంలో క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన అప్పటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌ను అడ్డుకోవడంతో పాటు, ఆ సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలపై సైదిరెడ్డి కేసులు పెట్టించారని, కార్యకర్తలపై దాడులు చేయించారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. అలాంటి నేతను పార్టీలో చేర్చుకొని టికెట్ ఎలా ఇస్తారని, కనీసం స్థానిక క్యాడర్, జిల్లా, పార్లమెంటరీ పార్టీ నాయకులతో సంప్రదింపులు చేయకుండా ఆయనకు టికెట్ కేటాయించడమేంటని బీజేపీ కీలక నేతలు వాపోతున్నారు. అదే సమయంలో బీజేపీ నేతలు మరో ప్రతిపాదనపైనా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్‌కు తాజాగా రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డిని పార్టీలో చేర్చుకొని ఆయన్ను నల్లగొండ ఎంపీగా బరిలో దింపాలని కోరుతున్నారు.

టికెట్ ఇస్తే చిన్నపరెడ్డి బీజేపీలో చేరుతారని వారు చెబుతున్నారు. చిన్నపరెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు రాయబారం నడుపుతున్న ముఖ్యనేతలు ఈ విషయాన్ని అధిష్ఠానానికి తెలియజేసినట్టు చర్చ సాగుతోంది. బీఆర్ఎస్ అధిష్ఠానంపై అసంతృప్తితోనే చిన్నపరెడ్డి పార్టీని వీడారని, గతంలోనూ ఆయన ఒక పర్యాయం ఎంపీగా పోటీచేశారని, ఎమ్మెల్యేగా కూడా రెండు పర్యాయాలు బరిలో నిలిచారని, ఎమ్మెల్సీగానూ పోటీచేశారని, పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న చిన్నపరెడ్డికి టికెట్ ఇస్తే బలమైన అభ్యర్థి అవుతారని బీజేపీలో ఒక వర్గం ప్రతిపాదిస్తోంది. మొత్తంగా నల్లగొండ లోక్‌సభ అభ్యర్థి విషయంలో తాజాగా తలెత్తిన వివాదాన్ని బీజేపీ అధిష్ఠానం ఎలా పరిష్కరిస్తుందనే అంశం ఆసక్తిరేపుతోంది. రోజురోజుకూ ముదురుతున్న ఈ వివాదంపై బీజేపీ అధిష్ఠానం ఇప్పటివరకు స్పందించకపోవడంతో భిన్నాభిప్రాయాలకు ఆస్కారం ఏర్పడుతోందని, ఈ వివాదానికి అధిష్ఠానమే ఫుల్‌స్టాప్ పెట్టాలని పార్టీ నాయకులు కోరుతున్నారు.

30న నల్లగొండ పార్లమెంట్ సన్నాహక సమావేశం

డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్, మార్చి 26: కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం ఈనెల 30న ఉదయం 11 గంటలకు హుజూర్‌నగర్ నియోజకవర్గం మఠంపల్లి మండలం మట్టపల్లిలో నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ తెలిపారు. మంగళవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఢిల్లీలో సీఈసీ సమావేశానికి వెళ్లాల్సి ఉండడంతో, సమావేశాన్ని 30కి వాయిదా వేశామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలోని పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు పాల్గొంటారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించే దిశగా పార్టీ శ్రేణులను ఈ సమావేశం ద్వారా సన్నద్ధం చేస్తామన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ దాసరి హరిచందన



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ టౌన్, మార్చి 26: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం మనదే అని, కుల, మత, లింగభేదం లేకుండా రాజ్యాంగం అందరికీ సమానంగా ఓటు హక్కును కల్పించిందని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. ఓటర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని నాగార్జున కళాశాల మైదానం నుంచి స్థానిక గడియారం సెంటర్ వరకు నిర్వహించిన 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గడియారం సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల సంఘం 85 ఏళ్లు నిండిన ఓటర్లకు, దివ్యాంగ ఓటర్లకు ఇంటి నుంచే ఓటింగ్ సదుపాయం కల్పించిందన్నారు. అందుకు ఫాం-12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సాక్ష్యం యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్‌రూమ్ ద్వారా సమీక్షించాలి

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీకృత కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జీలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన ఆదేశించారు. మంగళవారం సమీకృత కంట్రోల్ రూమ్‌ను ఆమె తనిఖీ చేసి ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల తనిఖీలను సీసీటీవీ వీడియోల ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నిల సందర్భంగా ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలకు వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నది లేనిది పర్యవేక్షించాలన్నారు. ఆమెవెంట అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్‌డీఏ నాగిరెడ్డి,కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్ ఉన్నారు.

మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

లోకసభ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు కలెక్టర్ హరిచందన తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు.

అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల విధులు నిర్వర్తించే పీవో, ఏపీవో, ఓపీవోల ర్యాండమైజేషన్ నిర్వహించారు. రిజర్వు సిబ్బంది కలిపి మొత్తం జిల్లా పరిధిలో 9,490 మంది పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ నిర్వహించారు. వారిలో 2,368 మంది పీవోలు, 2,377 మంది ఏపీవోలు, 4,745 మంది ఓపీవోలు ఉన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎంపిక చేసిన కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ విధులకు నియమితులైన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి గణపతిరావు, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్డీవో నాగిరెడ్డి, డీఈవో భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనిషి ధర్మభిక్షం



ధర్మభిక్షం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

సీపీఐ జిల్లాకార్యదర్శి నెల్లికంటి సత్యం

నల్లగొండ రూరల్, మార్చి 26: ప్రజల మనిషిగా సామాన్య జీవితం గడిపిన రైతాంగ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం అందరికీ ఆదర్శ ప్రాయుడని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ, భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజలను చైతన్యం చేసి దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన యోధుడు ధర్మభిక్షం అని కొనియాడారు. కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంతో శ్రమించారన్నారు. ఆయన పోరాట ఫలితంగానే ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడిపోయిన కల్లుగీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా అమలులోకి వచ్చిందన్నారు. ప్రజా ఉద్యమ క్షేత్రంలో ఉంటూ చట్టసభల్లోనూ పేదల పక్షాన నిలబడి మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా పనిచేసిన ధర్మభిక్షం చట్టసభల్లో పీడిత ప్రజల గొంతుక వినిపించారన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టులు నిర్మించాలని, సాగు, తాగు నీరుఅందించాలని ఎన్నో సభలో తన వాణి వినిపించారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, చిట్యాల పీఏసీఎస్ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రావణ్‌కుమార్, గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరస్వామి, గురిజా రామచంద్రం, గిరి రామ, ఖమ్మంపాటి వెంకన్న, విశ్వనాథుల లెనిన్, జిల్లా యాదయ్య, ఎస్‌కె.మదార్, యూసుఫ్, దోటి పందరి కౌసల్య, సుజాత పాల్గొన్నారు.

వైద్యులు అంకితభావంతో విధులు నిర్వహించాలి

అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర



ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

మిర్యాలగూడ అర్బన్, మార్చి 26: ప్రభుత్వ ఆస్పత్రి సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం కలిగించేలా వైద్యులు అంకిత భావంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి వైద్యుల వివరాలు తెలుసుకున్నారు. కుక్క, పాముకాటు వ్యాక్సిన్‌ను భద్రపరిచే గదిని పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆస్పత్రిలోని అన్ని విభాగాల వైద్యులు విధులకు హాజరుకావాలన్నారు. విధులకు హాజరుకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. వేసవిలో కుక్కకాటు కేసులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున రేబిస్‌వ్యాక్సిన్, పాముకాటు వ్యాక్సిన్‌ను సైతం అందుబాటులో ఉంచాలన్నారు.

క్రమం తప్పకుండా ఆస్పత్రి శానిటేషన్ ప్రక్రియ కొనసాగించాలని, సాధ్యమైనంత మేరకు సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులకు సూచించారు. ఓపీ, ఐపీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. జేసీ వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ నమరద్, మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, ఏవో మోయిన్‌ఖాన్, ఉన్నారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు

● అయినా ఆగని ఇసుక దందా ● పోలీసుల నామమాత్రపు తనిఖీలు

ఆత్మకూర్(ఎస్), మార్చి 26 : సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలోని ఏపూర్ గ్రామంలో 15 రోజులుగా ఇసుక దందా జోరుగా సాగుతోంది. ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా స్థానికుల ఒత్తిడి మేరకు పోలీసులు నామమాత్రంగా చర్యలు చేపట్టి కొన్ని కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత అక్రమ ఇసుక రవాణాపై నిఘా కరువైంది. ఏపూర్ బ్రిడ్జి వద్ద టాక్టర్లు పోకుండా పోలీసులు గాతులు తవ్వించారు. దీంతో పగలు ఇసుక రవాణా అపివేసి, రాత్రి వేళలో ఏపూర్ ఏటి నుంచి ఇసుక తరలింపును లింగంపల్లి మీదుగా తరలిస్తున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చినా ఫలితం లేకపోవడంతో గ్రామస్థులే రంగంలోకి దిగారు. సోమవారం రాత్రి ఏటిలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఒక సందర్భంలో ఇసుక తరలింపు చేస్తున్న వారు గ్రామస్థులపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. మంగళ వారం సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవరావు, అత్మకూర్(ఎస్) తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఇసుక తరలింపుపై చర్యలు తీసుకోవా లని చెప్పినా ఇసుక తరలింపు ఆగడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. ఇసుక తరలింపులో అధికార పార్టీకి చెందిన ట్రాక్టర్లు ఉండడంతో గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొనే ప్రమాదం ఉందని గ్రామస్థులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ ఇసుక దందాను అరికట్ట లేకపోవడంతో అధికారులపై అను మానాలు వ్యక్తమవుతున్నాయి.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు..

త్రిపురారం, మార్చి 26: తండ్రి చనిపోయిన బాధలోనూ ఓ విద్యార్థిని పదో తరగతి పరీక్ష రాసింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం పెద్దదేవులపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన తవిడబోయిన చంద్రశేఖర్ అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. చంద్రశేఖర్ కూతురు గాయత్రి మంగళవారం తండ్రి చనిపోయిన బాధను దిగమింగి ఫిజిక్స్ పరీక్ష రాసింది. పరీక్ష రాసి వచ్చిన అనంతరం తండ్రి మృతదేహాన్ని చూసి బోరున విలపించింది.



మళ్లీ సెలవుల్లోకి వెళ్లిపోయిన జేడీ

» ఉన్నతాధికారి పోస్టులో ఉండటానికి వెనుకడుగు» గొర్రెల యూనిట్ల బిల్లు ఫైల్‌తోనే సమస్యలా» చిక్కుల్లో డిప్యూటేషన్‌పై వెళ్లిన అధికారులు



నల్లగొండ, మార్చి 26 : ఈ సారు కాకపోతే, ఆ సారు, ఆ సారు కూడా కాకపోతే మరోసారు, అంతే తప్ప కొత్త సారు వచ్చేది లేదు, పశుసంవర్ధక శాఖ పరిస్థితి గాడిలపడేది లేదు అన్న చందంగా తయారైంది. జిల్లా పశుసంవర్ధక శాఖకు ఒరిజినల్ పోస్టులో ఉండాల్సిన అధికారి సైతం డిప్యూటేషన్‌పై రాష్ట్రస్థాయిలోని ప్రధాన కార్యాలయంలోకి పలుమార్లు వెళ్తా రావడమే సరిపోతోంది. అంతకుమించి స్థిరంగా ఒక అధికారి జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో కొనసాగలేకపోతున్నారు. దీంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందన్న చర్చ సాగుతోంది. అసలు పశుసంవర్ధక శాఖలో ఏం జరుగుతుంది ఎందుకు అధికారులు ఉండలేకపోతున్నారు, దానికి కారణాలు ఏమై ఉంటాయన్న గుసగుసలు సంబంధిత శాఖలోనే వినిపిస్తున్నాయి. పశుసంవర్ధక శాఖలో అధికారులు కీలకమైన పోస్టులో ఉండకుండా వెళ్లిపోతున్నా జిల్లాలోని ఉన్నత స్థాయి అధికారులతో పాటు రాష్ట్రస్థాయి పశుసంవర్ధకశాఖ కమిషనర్ లేదంటే డైరెక్టర్ కూడా పట్టించుకున్న పరిస్థితులు లేవు. దీంతో సంబంధిత శాఖలో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం అమలు చేసే పథకాలు రైతులకు, లబ్ధిదారులకు చేరవేయడంతో పాటు మూగజీవాల సంరక్షణ బాధ్యత మూగజీవాల రోగాల నివారణ కూడా డాక్టర్లు అధికారులపై ఉంటుంది. ఉన్నతాధికారులు రెగ్యులర్‌గా లేకపోవడంతో ఇన్‌చార్జి జేడీ పాలనే దిక్కు అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇన్‌చార్జి అధికారులు సైతం పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలూ వస్తున్నాయి. తాత్కాలికంగా ఇన్‌చార్జి ఇవ్వటంతో అధికారులకు ఉద్యోగులపై అజామాయిషీ పోతుందని డాక్టర్లు కూడా ఇన్‌చార్జి కాబట్టి పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఎప్పుడు అధికారి ఉంటారో ఎప్పుడు ఇన్‌చార్జి అధికారి ఉంటారో తెలియక కింది స్థాయి ఉద్యోగులు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో పశుసంవర్ధక శాఖలో పరిస్థితి దారుణంగా తయారైందని సమాచారం.

గత ప్రభుత్వ హయాంలో అవకతవకలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గొర్రెల యూనిట్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినా ఆ తర్వాత వరుసగా ఒక్కొక్కటిగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. గొర్రెల యూనిట్ల రీసైక్లింగ్ మొదలుకొని చివరకు అనేక అవినీతి భాగోతం బయటకు వచ్చింది. కాగా పరిశీలనలో అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అక్రమంగా ప్రభుత్వ సొమ్మును కాజేయడం కోసం ద్విచక్ర వాహనం నెంబర్‌ను వేసి అందులో వందలాది గొర్రెలను తరలించినట్లు రికార్డులను నమోదు చేయడం చూసి ఆశ్చర్యానికి గురైన పరిస్థితి. ఒక ఆటోలో 160 గొర్రెలను తరలించినట్లు కూడా చూపించి విమర్శల పాలయ్యారు. జిల్లాకు చెందిన ఓ శాఖ అధికారి సైతం గొర్రెల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడి ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్న విషయం తెలిసిందే. దళారుల వద్ద గొర్రెలను కొనుగోలు చేసి బిల్లులను పక్క దారిపట్టించిన విషయంలో అనేక విమర్శలు వస్తున్నాయి. ఇక జిల్లాలోని పశుసంవర్ధక శాఖలో 1,066 యూనిట్లకు సంబంధించిన ఫైల్ కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. అప్పటి కలెక్టర్ కర్ణన్‌తో పాటు ప్రస్తుత కలెక్టర్ హరిచందన దాసరి కూడా గొర్రెల యూనిట్లను రైతుల నుంచి కాకుండా దళారుల నుంచి కొనుగోలు చేశారన్న అనుమానం రావడంతో ఆ ఫైల్‌ను పక్కన పెట్టారు. ప్రస్తుతం ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. అప్పటి ప్రభుత్వంలో రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారి ఒకరు జిల్లా స్థాయిలో ఓ అధికారి ద్వారా గొర్రెల యూనిట్ల కొనుగోలు దళారుల నుంచి సేకరించినట్లు విచారణలో తేటతెల్లమైనట్లు తెలిసింది. ఇక ప్రస్తుతం ఎన్నికల కోడ్ రావడంతో ఆ ఫైల్ పూర్తిగా ఉన్నతాధికారులు పక్కనపెట్టారు. అయితే ఎప్పటికైనా ఈ ఫైలు తమ మెడకు చుట్టుకుంటుందని ఏఒక్క అధికారి కూడా జిల్లాలో పనిచేయడానికి ఆసక్తి చూపడం లేదని సమాచారం. తాము చేయని పనికి ఎందుకు ఇబ్బందులు పడాలని సెలవులు పెట్టడమే మేలని అధికారులు భావిస్తున్నట్టు సమాచారం.

జేడీ సుబ్బారావు వ్యక్తిగత పనులపై సెలవులు పెట్టారు

పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్బారావు వ్యక్తిగత పనులపై సెలవులు పెట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాను ఇన్‌చార్జిజేడీగా బాధ్యతలు స్వీకరించా. జిల్లాలో గొర్రెల యూనిట్ల కొనుగోళ్లకు సంబంధించిన బిల్లుల ఫైల్ కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ కావడంతో ఫైల్‌ను పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది.

-యాదగిరి,ఇన్‌చార్జి జేడీ, పశుసంవర్ధకశాఖ,నల్లగొండ

చిక్కుల్లో డిప్యూటేషన్ అధికారులు

పశుసంవర్ధక శాఖలో ఉద్యోగుల, అధికారుల కొరత ఉండటంతో వివిధ శాఖలలో అనుభవజ్ఞులైన అధికారులను గొర్రెల కొనుగోళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటేషన్‌పై పంపించింది. ఇతర శాఖలకు చెందిన కొంతమంది అధికారులు పశుసంవర్ధక శాఖకు డిప్యూటేషన్‌పై వెళ్లి గొర్రెల కొనుగోళ్ల ప్రక్రియలో పాల్గొన్నారు. మరికొందరు ఇష్టపూర్తిగానే డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు విశ్వసనీయసమాచారం. ఇది ప్రస్తుతం వారిని చిక్కుల్లో పెట్టినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు, ప్రకాశం జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలలో గొర్రెలను సేకరించారు. కాగ్ రిపోర్ట్ ప్రకారం అత్యధికంగా మధ్యవర్తుల నుంచి గొర్రెలను తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో రైతు నుంచి 10 నుంచి 12 యూనిట్లు మాత్రమే కొనుగోలు చేయాలి. కానీ అందుకు విరుద్ధంగా మధ్యవర్తుల నుంచి వందలాది గొర్రెల యూనిట్లనుసేకరించారు. ఇది పెద్ద సమస్యగా మారింది. ఇప్పటికీ హైదరాబాదులో ఏసీబీ అధికారులు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులను విచారణ చేస్తున్నారు. ఏ సమయంలో ఎవరికి సమస్య వస్తుందోనన్న భయం అధికారులు వెంటాడుతోంది. కొంతమంది తెలిసి చేయకపోయినా మరి కొంత మంది తెలిసి చేసినట్లు కూడా చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వంలో ఉన్నతాధికారితోపాటు కీలకమైన ప్రజాప్రతినిధి ఒకరు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సంబంధిత శాఖ అధికారులతో పాటు వివిధ శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన అధికారులతో సత్సంబంధాలు నెలకొల్పుకుని గొర్రెల కొనుగోళ్లలో అక్రమాలకు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాకు చెందిన ఒక శాఖ అధికారి జైలు శిక్ష అనుభవిస్తుండటంతో ఆ అధికారిని ఏసీబీ విచారణ చేసిన సందర్భంగా పలు విషయాలను వెల్లడించినట్లు సమాచారం. దీంతో జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాలో జరిగిన అక్రమాల గురించి భవిష్యత్‌లో మరిన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

డల్లాస్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

వేటా ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మహిళల నిర్వహణ



ఫ్రిస్కో సిటీ కౌన్సిల్ ప్రొటెం మేయర్ జోన్ కీటింగ్‌ను సత్కరిస్తున్న వేటా సంస్థ సభ్యులు

మిర్యాలగూడ, మార్చి 26 : నల్లగొండ జిల్లాకు చెందిన మహిళలు అమెరికాలోని డల్లాస్ నగరంలో వేటా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బోర్డ్ ఆఫ్ డైరక్టర్ ప్రతిమారెడ్డి, ఆర్గనైజర్ కల్లూరి శైలజల ఆధ్వర్యంలో ఫ్రిస్కోలో మంగళవారం ఇండిపెండెన్స్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఫ్రిస్కో సిటీ కౌన్సిల్ ప్రొటెం మేయర్ జోన్ కీటింగ్, టెక్ లీడర్ ఏమీ జుబ్లెన్స్కీ, అంబికా దద్వాల్‌లు ముఖ్యఅతిథిలుగా హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా అభివృద్ధిలో తెలుగు మహిళలు పాలుపంచుకోవటం గొప్పవిషయన్నారు. తెలుగు సంస్కృతి చాలా గొప్పదని తెలుగు మహిళలు డల్లాస్‌లో కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. 'తెలుగు మహిళల కోట- స్త్రీ ప్రగతి పథమే బాట' అనే నినాదంతో తెలుగు మహిళల కోసం మహిళా సాధికారతే లక్ష్యంగా ఝాన్సీరెడ్డి హనుమాండ్ల ఉమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్(వేటా) సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు నైపుణ్యాలను అందించడం, సాధికారత శక్తిని అందించడం, మహిళా నాయకత్వ శక్తిని ప్రపంచానికి తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నల్లగొండ జిల్లాకు చెందిన మహిళలు తెలుగు సాంప్రదాయ రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ సేవలు అందించిన సురోమాసిన్హా, మెర్సిస్టిక్ ల్యాండ్‌లకు సేవా పురస్కారాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేటా డల్లాస్ టీం సభ్యులు నవ్య స్మృతిరెడ్డి, గాయత్రీ, మాధవి, ప్రశాంతి, జ్యోత్స్న, రేఖ, వంక రత్నమాల, సునీత, విశ్వావేమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలుచేయాలి



సమావేశంలో పాల్గొన్న తెలుగు రాష్ట్రాల కలెక్టర్లు, పోలీసు అధికారులు

కోదాడ రూరల్, మార్చి 26 : ఎన్నికల నియమావళిని తెలుగు రాష్ట్రాలు సమన్వయంతో పటిష్ఠంగా అమలుచేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకటరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావులు అన్నారు. మంగళవారం ఇరు రాష్ట్రాల పోలీస్, రెవెన్యూ అధికారులతో ఎన్నికల నియమావళిపై ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట దగ్గరలోని రాంకో సిమెంట్ ఫ్యాక్టరీలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇరు జిల్లాల కలెక్టర్లతో పాటు సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, ఎన్టీఆర్ రూరల్ జిల్లా డీసీపీ శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రాష్ట్రాల సరిహద్దుగా ఉన్న కోదాడ, జగ్గయ్యపేట మండలాల్లోని ఇరు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు పర్చేందుకు కృషి చేయాలన్నారు. నగదు తరలింపు, మద్యం తరలింపు, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన, పలు సమస్యలపై ఇరు రాష్ట్రాల సరిహద్దు అధికారులు నిఘా ఉంచి అప్రమత్తంగా పనిచేయాలని, ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. సమావేశంలో నందిగామ ఏసీపీ రవికిరణ్, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐలు రాము, రజితారెడ్డి, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.4.30 లక్షల పట్టివేత

మర్రిగూడ, కోదాడ రూరల్, మార్చి 26 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో చేపట్టిన తనిఖీల్లో రూ.4.30 లక్షలను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని చర్లగూడ ఎక్స్‌రోడ్డు వద్ద నల్లగొండ జిల్లాకు చెందిన మహ్మద్ ముదాసీ మాల్ నుంచి నల్లగొండకు వాహనంలో రూ.3.30 లక్షలు తరలిస్తున్నాడు. పోలీసులకు సరైన పత్రాలను చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు. అదేవిధంగా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు పోలీసులు రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. లక్ష స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. నగదును ఎన్నికల అధికారికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.



మర్రిగూడలో నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

పెళ్లిపీటలు ఎక్కాల్సిన యువకుడు పాడెనెక్కాడు



చెన్నకేశవులు(ఫైల్)

గుర్రంపోడు, మార్చి 26: తెల్లవారితే పెళ్లి పీటలు ఎక్కాల్సిన పెళ్లికుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలో మంగళవారం వెలుగుచూసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గుర్రంపోడు మండలం చేపూరు గ్రామానికి చెందిన ముష్టిపల్లి చెన్నకేశవులు(29) గడ్డి కట్టలు కట్టే యంత్రం మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల చెన్నకేశవులుకు నాంపల్లి మండలానికి చెందిన ఓ యువతితో వివాహ నిశ్చితార్థమైంది. ఈ నెల 27న వివాహం జరగాల్సి ఉంది. వివాహానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ కుటుంబ సభ్యులు పూర్తిచేశారు. ఆదివారం రాత్రి 10గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన చెన్నకేశవులు పెద్దఅడిశర్లపల్లి మండలంలోని గనిపల్లి గ్రామంలోని గట్టు వద్ద ఓ చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించాడు. సోమవారం ఉదయం సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా క్రిమిసంహార మందు డబ్బాలతో పాటు పక్కన చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మంగళవారం స్వగ్రామం గుర్రంపోడు మండలం చేపూరులో అంత్యక్రియలు నిర్వహించారు. పెళ్లిపీటలు ఎక్కాల్సిన యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాఛాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉండగా చెన్నకేశవులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

దుకాణం నడవటం లేదని యువకుడు...

కోదాడ రూరల్, మార్చి 26: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో దుకాణం నడవటం లేదని యువకుడు బలవన్మరణం చెందాడు. ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లబండగూడెం గ్రామానికి చెందిన నల్లపు కిరణ్(26) కూల్‌డ్రింక్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణం సరిగా నడవకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం రాత్రి తన గదిలో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యం బాగాలేక ..

ఆలేరు రూరల్, మార్చి 26 : ఆరోగ్యం బాగాలేకపోవడంతో యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ మోహన తెలిపిన వివరాల ప్రకారం ఆలేరులోని పోచమ్మ గుడి సమీపంలో నివాసముంటున్న ఠాకూరు శివ(28) స్థానికంగా ఉండే పాత ఇనుప సామాను దుకాణంలో పనిచేస్తున్నాడు. శివకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన ఆరోగ్య స్థితి బాగా ఉండటం లేదు. దీంతో మనస్తాపానికి గురైన శివ మంగళవారం తెల్లవారుజామున రైల్వే గేట్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని చెట్టుకు ఉరివేసుకున్నాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.



కోదాడ కోర్టులో షార్ట్‌సర్క్యూట్‌తో ఫైల్స్ దగ్ధం

కోదాడ టౌన్, మార్చి 26 : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పట్టణ సీఐ రజితారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కోర్టు గదిలో బీరువా సమీపంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగిందని తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కోర్టుకు చేరుకొని ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అదేవిధంగా విద్యుత్ అధికారులు పిలిపించి, ప్రమాద ఘటన ఎలా జరిగిందో తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని విద్యుత్ అధికారులు చెప్పినట్లు తెలిపారు. కాగా ప్రమాదంలో బీరువాపై అలమరాలో దాచిన ఫైల్స్ దగ్ధమయ్యాయని తెలిపారు. కోర్టు సూపరింటెండెంట్ మొహిన్‌అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రమాద ఘటనపై విచారణ చేపట్టినట్లు తెలిపారు.

నల్లబెల్లం స్వాధీనం

హుజూర్‌నగర్, మార్చి 26 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని మేళ్లచెర్వు, చింతపాలెం, మఠంపల్లి మండలాల్లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు ఏకకాలంలో నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. చింతలపాలెం మండలం యర్రకుంటతండాలో ఆంగోత్ గోపి, పద్యా ప్రసాద్ నుంచి అక్రమంగా తరలిస్తున్న ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేశారు. అదేవిధంగా యర్రకుంటతండాలోని గుగులోత్ రమేష్ ఇంటి నుంచి ఐదు లీటర్ల సారా, 200 కిలోల బెల్లం స్వాధీనం చేసుకుని 800 లీటర్ల బెల్లం పాకనాన్ని ధ్వంసం చేశారు. కాగా రమేష్‌పై కేసు నమోదుచేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు దివ్య, జగన్మోహన్‌రెడ్డి, రుక్మారెడ్డి, నాగరాజు, ధనుంజయ్‌లు పాల్గొన్నారు.


బస్సులో గుండెపోటుతో ప్రయాణికుడు మృతి

చిట్యాల, మార్చి 26: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాలలో మంగళవారం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన బాదావత్ రాందాస్(62) అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం మంగళవారం ఉదయం భార్యతో కలిసి ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరారు. బస్సు నల్లగొండ జిల్లా చిట్యాల సమీపంలోకి రాగానే ఛాతీలో నొప్పి వస్తుందని రాందాస్ చెప్పడంతో తోటి ప్రయాణికులు బస్సు సీటులోనే పడుకోబెట్టి సీపీఆర్ చేశారు. ఈ లోపు డ్రైవర్ బస్సును చిట్యాల పోలీస్‌స్టేషన్ వద్ద ఆపాడు. చికిత్స కోసం 108 సిబ్బందికి ఫోన్ చేయగా, వారు వచ్చి పరీక్షించి రాందాస్ అప్పటికే మృతిచెందాడని తెలిపారు. మృతదేహాన్ని పోలీసులు మరో వాహనంలో స్వస్థలానికి తరలించారు. బస్సులో ప్రయాణికుడు మృతి చెందడంతో గంటకు పైగా బస్సు నిలిచిపోయింది.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి...

చిట్యాల, మార్చి 26 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందినట్లు నల్లగొండ జిల్లా చిట్యాల ఎస్ఐ కే లింగయ్య తెలిపారు. ఈ నెల 5న జాతీయ రహదారిపై చిట్యాల రైల్వే బ్రిడ్జ్ సమీపంలో వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పిన ఘటనలో యువకుడు..



స్వామి(ఫైల్)

మునుగోడు రూరల్, మార్చి 26 : బైక్ అదుపు తప్పిన ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మునుగోడు మండలం జక్కలవారిగూడెం శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ చందా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి ఎలుగులగూడెం గ్రామానికి చెందిన తీర్పారు స్వామి(20) తన మిత్రుడు దాం కిరణ్‌తో పాటు మునుగోడు నుంచి పల్సర్ బైక్‌పై ఎలుగలగూడెం వెళ్తున్నాడు. జక్కలవారిగూడెం శివారులో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్క గుంటలో పడటంతో బైక్‌ను నడుపుతున్న తీర్పారి స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చున్న కిరణ్‌కు గాయాలయ్యాయని తెలిపారు. స్వామి తండ్రి భిక్షం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చందా వెంకటేశ్వర్లు తెలిపారు.

● బంగారు చందమామ



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం రాత్రి చంద్రుడు బంగారు వర్ణంలో కనువిందు చేశాడు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహాస్వామి ఆలయం విద్యుత్ వెలుగుల్లో ప్రతి రోజూ స్వర్ణమయంగా కనిపిస్తుండగా గోపురాల పైన చంద్రుడు కూడా బంగారు వర్ణంలో కనిపించడంతో భక్తులు మంత్రముగ్ధులయ్యారు. భక్తులు అరుదైన సుందర దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్లో బంధించేందుకు పోటీపడ్డారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో మంగళవారం సాయంత్రం సూర్యాస్తమయం తరువాత చంద్రుడి చుట్టూ ఆకాశం ఎర్ర బడి వలయంగా మారింది. ఈ అద్భుత దృశ్యాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

●భువనగిరి అర్బన్, నేరేడుచర్ల

మద్యం దుకాణాల్లో చోరీ చేస్తున్న అంతర్ జిల్లా ముఠా అరెస్ట్

భువనగిరి టౌన్, మార్చి 26 : మద్యం దుకాణాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ ఎం రాజేష్ చంద్ర వివరాలను వెల్లడించారు. సిద్ధిపేట జిల్లా కామారెడ్డి నాగార్జున కాలనీకి చెందిన పిన్నోజు రవి ఆంధ్రప్రదేశ్ సత్యసాయి జిల్లా లేపాక్షి మండలం సిరివరం గ్రామానికి చెందిన బైరప్పగారి హరీష్‌కుమార్‌కు కరీంనగర్ జైల్‌లో స్నేహం కుదిరింది. అయితే హరీష్‌కుమార్ నెల రోజుల కిందట జైలు నుంచి విడుదల కాగా రవి ఈ నెల 23న విడుదలయ్యాడు. అదే రోజు పాత నేరస్తులైన యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామానికి చెందిన శాఖాపురం నవీన్‌కుమార్, సిద్దిపేటలోని గణేష్‌నగర్‌కు చెందిన చెప్యాల నర్సింహులుతో జత కట్టి అదే రోజుగా తుర్కపల్లిలోని మద్యం దుకాణంలో చోరీ చేశారు. ఈ మేరకు మద్యం దుకాణం నిర్వాహకుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎండీ తాకీరుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 25న రాత్రి అదే మండలం వాసాలమర్రి వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో జగదేవ్‌పూర్ నుంచి భువనగిరి వైపు రెండు మోటార్ బైక్‌లపై అనుమానాస్పదంగా వెళ్తున్న పైనలుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా తుర్కపల్లిలోని దుర్గా వైన్స్‌లో చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. అయితే రవి, హరీష్‌కుమార్ ప్రత్యక్షంగా దొంగతనంలో పాల్గొనగా మిగతా ఇద్దరు దొంగతనానికి సహకరించారు. ఈ మేరకు ఆ నలుగురిని విచారించిన క్రమంలో పలు జిల్లాల్లో చోరీ కేసులలో నిందితులుగా ఉన్నట్లు తేలినట్లు డీసీపీ తెలిపారు. నిందితుల నుంచి రూ.4.4లక్షల నగదు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. పలు చోరీ కేసులలో ప్రధాన నిందితులుగా ఉన్న రవి, హరీష్‌కుమార్‌పై పీడీయాక్ట్ నమోదు కోసం ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు. సీసీ కెమెరాల సాయంతో మూడు రోజుల్లో దొంగతనాన్ని ఛేదించిన తుర్కపల్లి పోలీసులకు డీసీపీ నగదు రివార్డును అందజేసి అభినందించారు. పార్లమెంట్ ఎన్నికల కోసం జిల్లాలో భారీ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు డీసీపీ తెలిపారు. రెండు అంతర్ జిల్లా చెక్ పోస్టులను, 2 మొబైల్‌చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలను చేస్తున్నారు. సమావేశంలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ రమేష్‌కుమార్, యాదగిరిగుట్ట రూరల్ సీఐ కొండల్‌రావు,తుర్కపల్లి ఎస్ఐ తాకీరుద్దీన్ పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన ముగ్గురి అరెస్ట్

భువనగిరి రూరల్, మార్చి 26 : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం వడపర్తిలో దాడి చేసి గాయపరిచిన ముగ్గురిని అరెస్ట్ చేసిన కోర్టులో హాజరు పరిచినట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ వి సంతోష్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 19న వడపర్తికి చెందిన మేడబోయిన సత్తయ్య అతడి కుమారుడు మేడబోయిన బాలమల్లేష్, గోపికృష్ణ భూతగాదాల కారణంగా పక్క భూమి రైతు ఎలిమినేటి పద్మారెడ్డిపై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. దీంతో ఆయనను సికింద్రాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తులో భాగంగా పైముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ వివరించారు.

బంగారు పుస్తెలతాడు అపహరణ

చౌటుప్పల్ రూరల్ మార్చి 26 : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండం తంగడపల్లిలో వృద్ధురాలి మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం తంగడపల్లి వినాయకనగర్‌కు చెందిన రాచకొండ పుష్పమ్మ(70) ఇంటి ముందు కూర్చొని ఉండగా బైక్‌పై వచ్చిన యువకుడు పుష్పమ్మ మెడ నుంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.పుస్తెలతాడు విలువ రూ.2 లక్షలకు పైగా ఉంటుందని బాధితురాలు తెలిపింది.

అక్రమంగా తరలిస్తున్న మద్యం సీజ్

తిప్పర్తి, మార్చి 26 : అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని మంగళవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ డీ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాడ్గులపల్లి మండలం కన్నెకల్ గ్రామానికి చెందిన గంటెకంపు లక్ష్మణ్ తిప్పర్తి మండలకేంద్రంలోని వైన్స్ నుంచి 36 బీర్లు తీసుకెళ్తుండగా నల్లగొండ రోడ్డులోని పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం విలువ సుమారు రూ.5 వేలకు పైగా ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

సాంబశివుడి ఆశయ సాధనకు కృషిచేయాలి



సాంబశివుడి చిత్రపటానికి పూలమాలు వేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, మార్చి 26: సాంబశివుడి ఆశయ సాధనకు కృషిచేయాలని యాదవ రాజ్యాంగ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చల్లా కోటేష్‌యాదవ్, రాష్ట్ర సలహాదారుడు బెల్లి నాగరాజుయాదవ్ కోరారు. మావోయిస్టు పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కోనపూరి సాంబశివుడి 13వ వర్ధంతిని సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో సాంబశివుడి కీలక పాత్ర వహించారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీర పంకజ్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, బీసీపీ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతాలుయాదవ్, లొడంగి గోవర్ధన్, మామిడి పద్మ, బొమ్మరబోయిన నాగార్జున, మల్లిక, ఎక్కలూరి వెంకట్‌రెడ్డి, మేక శ్రీధర్ రెడ్డి, లింగయ్య, చిలకల ప్రకాష్‌యాదవ్ పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్ల నియామకాలపై విచారణ చేయాలి

మిర్యాలగూడ, మార్చి 26: వెనకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్ వర్కర్ల నియామకాల్లో జరిగిన అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర సైదానాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలో వర్కర్ల సమస్యపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుమార్లు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వర్కర్ల నియామకానికి అధికారులు ఇచ్చిన వెసులుబాటును దుర్వినియోగం చేస్తూ 62 మంది నిరుపేదలైన పార్ట్‌టైం వర్కర్ల నియమించి వారి నుంచి ఏబీసీడబ్ల్యూవో లక్షలాది రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. ఒక్కొక్కరి నుంచి రూ.50వేల లంచంగా తీసుకోగా ఏజెన్సీ నిర్వాహకుడు రూ.5వేల చొప్పున తీసుకున్నారని ఆరోపించారు. సెక్షన్ అధికారి సైతం అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు జగన్, వదూద్, శివ, ముని తదితరులు పాల్గొన్నారు.

స్వామికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు అవార్డు



నల్లగొండ, మార్చి 26: మారథాన్ రన్నర్, బీఎస్ఎన్ఎల్‌లో జూనియర్ టెలికాం ఆఫీసర్ చిన్నపాక స్వామి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు అవార్డు అచీవర్-2024 అందుకున్నారు. ప్రతిరోజూ ఐదు కిలోమీటర్లు పరుగు వెయ్యి రోజులు ఇటీవల పూర్తిచేసుకుని ఇప్పటివరకు 6,332 కిలోమీటర్ల పరుగు ప్రయాణాన్ని చేరుకున్నందుకు అవార్డు అందుకున్నట్లు స్వామి తెలిపారు. కుటుంబ సభ్యులు, క్విట్ ఇండియా ఫౌండేషన్ వారియర్స్, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు అభినందించారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.21.92లక్షలు

నార్కట్‌పల్లి, మార్చి 26: మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థాన హుండీని మంగళవారం లెక్కించారు. 26 రోజులకు రూ.21,92,075ల ఆదాయం సమకూరిందని ఈవో సిరికొండ నవీన్‌కుమార్ తెలిపారు. గుట్టపైన ఉన్న హుండీలను తెరిచి లెక్కించగా రూ.18,83,685లు, గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయం వద్ద ఉన్న హుండీలను తెరిచి లెక్కించగా రూ.3,08,390లు లభించాయని పేర్కొన్నారు. నిత్యాన్నదానం కోసం భక్తులు సమర్పించిన విరాళాల మొత్తం రూ.36,580 వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్ డివిజన్ పర్యవేక్షకురాలు వెంకటలక్ష్మి, ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరెడ్డి, సిబ్బంది వల్లూరి శంకర్, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాజయ్య, వెంకటయ్య, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

వేములపల్లి, మార్చి 26: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ బీసీ ఫైనాన్స్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఆమనగల్లు గ్రామంలోని పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పూజల్లో పాల్గొన్నారు. రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ దేశబోయిన రవికుమార్, ఆలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు, బయ్య సైదులు, పత్తిపాటి స్వరాజ్యలక్ష్మీ, పిల్లల సందీప్, కోల పెదసైదులు, వల్లంపట్ల అబ్రహం, సైదులు, కృష్ణయ్య, నగేష్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి

మర్రిగూడ, మార్చి 26: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సుశీలమ్మ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మీ అన్నారు. నాంపల్లి మండలకేంద్రంలో మదర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కుట్టుమిషన్‌లో శిక్షణ పొందిన వెయ్యి మంది మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న వంటి మహిళలకు వారి ఉపాధి కోసం ఇలాంటి కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మదర్ ఎడ్యుకేషన్ రూరల్ సొసైటీ చైర్మన్ బొజ్జ సంధ్యారెడ్డి, జడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పానగంటి రజనివెంకన్నగౌడ్ కత్తి రవీందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, పూల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మిర్యాలగూడ అర్బన్, మార్చి 26: వీధి వ్యాపారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ మోహన్‌బాబు సూచించారు. పట్టణంలోని సాగర్‌రోడ్డుపై గల తోపుడుబండ్లతో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు మంగళవారం సాగర్‌రోడ్డుపై మన ఊరు విశాలం అనే కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న తోపుడుబండ్లను ఫుట్‌పాత్‌నుంచి తొలగించి ప్రతిరోజు ఇదే పద్ధతిలో చిరువ్యాపారులు తమ వ్యాపార లావాదేవీలు కొనసాగించాలన్నారు. షాపింగ్ మాల్స్ వద్ద ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా పార్కిగ్ రూల్స్‌ను పాటించాలని యాజమాన్యాలకు సూచించారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ



వేములపల్లిలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వేములపల్లి, మార్చి 26: మండలంలోని సల్కునూరు గ్రామ స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామి, ఆండాలు అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్ముడబోయిన అర్జున్ పూజల్లో పాల్గొన్నారు. గ్రామంలోని గణేష్ యూత్ ఆధ్వర్యంలో తరలివచ్చిన భక్తులకు పులిహోరా అందజేశారు. అనంతరం నీలా భిక్షమయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య నీలా పాండారమ్మ, కుమారుడు నీలా సత్యనారాయణ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చక్రతీర్థస్నానం, పూర్ణాహుతి

నిడమనూరు: మండల పరిధిలోని ముప్పారంలో 902 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రాచీన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఆరు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో చివరి రోజున చక్రతీర్థస్నానం, పూర్ణాహుతి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పండితుల వేద మంత్రాల నడుమ మంగళ వాయిద్యాలతో బ్రహ్మోత్సవాల్లో ప్రాధాన్యత కలిగిన పూర్ణాహుతి, చక్రతీర్థస్నానం కార్యక్రమాలను నేత్రపర్వంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని గ్రామంలో పల్లకి సేవలో ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ యడవెల్లి విజయ్‌కుమార్‌రెడ్డి, ఈవో నవీన్, గణపురం సత్యనారాయణ, మర్రిశ్రీను, తాడూరి పున్నయ్య, నాగమ్మ పాల్గొన్నారు.

తుమ్మలపల్లిలో ఘనంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం

చండూరు రూరల్: చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామంలోని రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం(పెద్ద తేరు) రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా చండూరు మండల పరిసర ప్రాంతాలే కాకుండా జిల్లా పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు కోరిమి ఓంకారం, దోటి వెంకన్న, ఉజ్జిని అనిల్‌కుమార్, సీఐ వెంకటయ్య, ఎస్ఐ సురేష్ ఉన్నారు.

ఆధ్యాత్మిక ఆలోచనలతో మానసిక ప్రశాంతత

చిట్యాల: ఆధ్యాత్మిక ఆలోచనలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల కనకదుర్గ ఆలయ 21వ వార్షికోత్సవాల్లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని సూచించారు. వార్షికోత్సవం సందర్భంగా





చండూరు: రథోత్సవం, నిడమనూరు పూజల్లో పాల్గొన్న భక్తులు

గణపతిపూజ, స్వస్తివాచనము, మంటపారాధన, పంచామృతాభిషేకము, వార్షిక మహోత్సవ పూజ, దుర్గాహోమం, పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులుగౌడ్, బుద్ద విమల, గంజి వెంకటేశం, వరకాంతం నర్సింహ్మారెడ్డి, రుద్రారపు లింగయ్య, జిట్ట సాయిలు, వనమా నిఖిల్ కుమార్, ఎద్దులపురి కృష్ణ, ఏర్పుల పరమేశం, కుక్కల మోహన్ ఉన్నారు.

ఘనంగా భద్రకాళి బోనాలు

వేములపల్లి: మండలంలోని ఆమనగల్లు పార్వతీరామలింగేశ్వరస్వామి జాతర మహోత్సవంలో భాగంగా మంగళవారం తెల్లవారుజామున స్వామి వారి అగ్నిగుండాల ప్రవేశంతో జాతర ముగిసింది. ఆలయ ప్రాంగణంలోని భద్రకాళి అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. శివసత్తులు, పోతురాజుల విన్యాసాలతో బోనాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బోనాలతో వచ్చిన మహిళలకు దేవాలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు అశోకకుమారి దంపతులు చీరెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిల్లల సందీప్, మాజీ సర్పంచ్ వల్లంపట్ల ఝాన్సీప్రవీణ్, ధర్మకర్తలు లొండ కలమ్మ, పెరుమాళ్ల జోజి, కొండా వెంకన్న, వాకిటి భిక్షం పాల్గొన్నారు.

ధర్మభిక్షం ఆశయాలు సాధించాలి



నల్లగొండలో ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, మర్రిగూడ, చండూరు, మునుగోడు, దేవరకొండ, మిర్యాలగూడ, చిట్యాల, మార్చి 26: తెలంగాణ పోరాట యోధుడు సాయుధ పోరాటయోధుడు, మాజీ ఎంపీ బొమ్మ గాని ధర్మభిక్షం ఆశయాలు సాధించాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ధర్మభిక్షం వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. నల్లగొండలో జరిగి కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్ మాట్లాడారు. జిల్లాకేంద్రంలో ధర్మభిక్షం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కారింగ్ నరేష్‌గౌడ్, చింతల విజయ్‌కుమార్‌గౌడ్, కొంపెల్లి రామన్నగౌడ్, పొగాకు రవికుమార్ యాదవ్, కనకాలరెడ్డి, భైరగోని అఖిల, పులకరం మౌనిక, వస్పరి రాధిక, మేడి స్వాతి, బండి రమ్యశ్రీ పాల్గొన్నారు. మర్రిగూడలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, బూడిద సురేష్, చల్లం పాండురంగారావు, ఎరుకల నిరంజన్‌గౌడ్, ఆకుల రఘుమయ్య ఉన్నారు. చండూరులో బొమ్మగాని ధర్మభిక్షం చిత్రపటానికి సీపీఐ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలిం గయ్య, పల్లె శంకరయ్యగౌడ్, పల్లె యాదయ్య, గంట రమేష్, నగేష్, కురుపాటి పరమేష్ పాల్గొన్నారు. మునుగోడులోని సీపీఐ కార్యాల యంలో ధర్మ భిక్షం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం, బొల్గూరి నర్సింహ, చాపల శ్రీను, బండమీది యాదయ్య, దుబ్బ వెంకన్న, ఎండీ. జానిమియా, చిరంజీవి, వెంకన్న, బండారు శంకర్, నరేష్ పాల్గొన్నారు. దేవరకొండ సీపీఐ కార్యాలయంలో ధర్మభిక్షం చిత్రప టానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లె నర్సింహ, ఉప్పునూతల వెంకటయ్య, జయరాములు, పల్లా రంగారెడ్డి, జూలూరి వెంకటేశ్వర్లు, వెంకట్రాములు, మైనొద్దిన్, పాల్గొన్నారు. గీతా పని వారల సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడలో ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, గీతా కార్మికులు ఆకిట రామస్వామి, బంటు వెంకటయ్య, గువ్వల రామలింగం, హన్మంతు, సైదులు పాల్గొన్నారు. చిట్యాలలో జరిగిన కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు, ఎండీ అక్బర్, బొల్గూరి లింగయ్య, ఎస్‌కే ఫరీఫ్, మేకల బిక్షం, గుండాల సత్తయ్య, పాపయ్య పాల్గొన్నారు.

రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించాలి

కట్టంగూరు, మార్చి 26: ఆధునిక పద్ధతులు ఉపయోగించుకుని రైతులు అధిక లాభాలు పొందాలని నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్ కోరారు. మండలంలోని అయిటిపాముల పరిధిలోని గంగాదేవిగూడెం వద్ద ఏర్పాటు చేసిన కట్టంగూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కమిటీ లిమిటెడ్‌కి ఉమ్మడి నల్లగొండ జిల్లా కోరమాండల్ కంపెనీ ఆధ్వర్యంలో నాలుగు డ్రోన్లను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహ్మారెడ్డి, కోరమాండల్ డీడీఎం వెంకటేశ్వర్లు, ప్రసాద్, ప్రీతం, తిరుమల్‌రెడ్డి, సూర్యచందర్‌రెడ్డి, స్వరాజ్, సతీష్, అశోక్ తదితరులు ఉన్నారు.

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రియదర్శిని



చిట్యాల రూరల్, మార్చి 26: బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేడి ప్రియదర్శిని నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్లగా పార్టీ బలోపేతానికి చేస్తానని తెలిపారు. బహుజనులంతా ఏకతాటిపైకి వచ్చి అన్ని రంగాల్లో తమ వాటాను సాధించుకునేందుకు ముందుకు రావాలన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

శివాలయాన్ని సందర్శించిన శైవ ఆగమన పండితులు

కనగల్, మార్చి 26: కనగల్ గ్రామంలోని పురాతన బండి రామలింగేశ్వర స్వామి శివాలయ పునర్‌నిర్మాణంలో భాగంగా శైవ ఆగమన పండితులు డాక్టర్ నీలకంఠశాస్త్రీ బృందం సభ్యులు మంగళవారం ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి సంబంధించిన స్థల వివరాలు వారు నమోదు చేసుకున్నారు. గుడి పునర్‌నిర్మాణానికి వారంలో కొత్త డిజైన్ రూపొందించి అందజేస్తామని పేర్కొన్నారు. ఇటీవల గ్రామంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో గుడిని పునర్‌నిర్మించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. ఇందులో బాగంగా ఆగమనశాస్త్రం ప్రకారం డిజైన్‌రూపకల్పన కోసం నీలకంఠశాస్త్రిని ఆలయానికి ఆహ్వానించారు.

మాజీ ఎమ్మెల్యేలను కలిసిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల

నల్లగొండ, మార్చి 26: నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి తన సొదరుడు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్యేలను కలిశారు. ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్‌ను కలిశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల గురించి చర్చించారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

మునుగోడు రూరల్, మార్చి 26: పార్టీ బలోపేతానికి కృషిచేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణుకుమార్ కోరారు. మండలంలోని గంగోరిగూడెం, ఊకొండి, సింగారం గ్రామాల్లో మంగళవారం జరిగిన పార్టీ బూత్ కమిటీ సమావేశాల్లో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు మాదగోని నరేందర్‌గౌడ్, బండారు యాదయ్య, బొల్గురి రమేష్, కంభంపాటి నర్సింహ, వెంకట్‌రెడ్డి, కారింగి అనిల్, ఉప్పునూతల సత్యనారాయణ, ఏలే కృష్ణరెడ్డి, కట్టకుంట భార్గవ్, బోయపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

దేవరకొండ, మార్చి 26: దేవరకొండ మునిసిపాలిటీలో మిషన్‌భగీరథ ద్వారా తాగునీరు సరఫరా చేసి నీటి సమస్యను పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వివిధ వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. వార్డుల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు భాస్కరచారి, నాగయ్య, యాదయ్య, శ్రీనివాసులు, అబ్దుల్‌కలాం పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం

నకిరేకల్, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నకిరేకల్ నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని ఏఎస్పీ రాములునాయక్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని సమస్యాత్మక 30సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 22 ఆయుధాల లైసెన్స్ తీసుకున్నవారు ప్రభుత్వానికి అప్పగించాలన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో 4 సెంటర్ల నుంచి ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ఇంటలిజెన్స్ డీఎస్పీ రమేష్, నకిరేకల్ సీఐ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రన్‌ఫర్ జీసస్‌ను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, మార్చి 26: యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన నిర్వహించే రన్ ఫర్ జీసస్, ఈస్టర్ పండుగను జయప్రదం చేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో మంగళవారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఏసు ప్రభువు మరణాంతరం తిరిగి మూడో రోజు పునరుత్థాన జరిగే ఈస్టర్ పండగకు ముందు రోజు రన్ ఫర్ జీసస్ భారీ ఎత్తున ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ చీఫ్ అడ్వయిజర్ దాసరి ప్రశాంత్‌కుమార్, ఫెలోషిప్ అధ్యక్షుడు కత్తి డేవిడ్ రాజు, కార్యదర్శి పి సైమన్, కోశాధికారి రవికుమార్, గౌరవ అధ్యక్షుడు ఎం. ఏసయ్య, ఉపాధ్యక్షుడు ఎస్కే జాన్‌బాబు, ఆర్. తిమోతి, సంపూర్ణ దేవి, సామ్యూల్ జేమ్స్, పేర్ల శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందుగులలో కొనసాగుతున్న వైద్య శిబిరం

మాడ్గులపల్లి, మార్చి 26: మండలంలోని ఇందుగుల గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతోంది. రెండు నెలలుగా విషజ్వరాలు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వైద్యాధికారులు తిరిగి మందులు పంపిణీ చేస్తున్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు. కార్యక్రమంలో డీఎంవో దుర్గయ్య, పల్లె దవాఖాన వైద్యురాలు ఫిర్దోస్, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు 70మంది గైర్హాజరు

నల్లగొండ, మార్చి 26: జిల్లావ్యాప్తంగా మంగళవారం జరిగిన భౌతికరసాయన పదో తరగతి పరీక్షకు 19,638మంది విద్యార్థులకు 19,568మంది హాజరయ్యారు. 70మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 30పరీక్ష కేంద్రాలను అధికారులతో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు సందర్శించాయి. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నల్లగొండ టౌన్, మార్చి 26: గ్రూప్ 1,2,3,4, బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, యస్ఎస్‌సీ రాష్ట్రస్థాయి, కేంద్ర స్థాయి ఉద్యోగాలకు ఫౌండేషన్ కోర్సు ద్వారా మూడు నెలల పాటు ఉచిత వసతి, శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న పట్టణంలో గల విశ్వదీప్ విద్యాపీట్ హైస్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు తెలిపారు.

లింగమయ్యా.. ఇక సెలవయ్యా

● ముగిసిన ఎర్రబెల్లి గట్టు జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

నిడమనూరు, మార్చి 26: మండలంలోని ఎర్రబెల్లిలో లింగమంతులస్వామి గట్టు జాతర మంగళవారం ముగిసింది. 'లింగ మంతుల స్వామి మమ్మల్ని సల్లంగా చూడాలి స్వామి.. మళ్లీ రెండేళ్ల తర్వాత జరిగే జాతరకు వచ్చి మామొక్కులు సమర్పించుకుంటాం స్వామి' అంటూ భక్తులు గుట్ట వద్ద సెలవు తీసుకున్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించిన జాతర మాణిక్యాలదేవి గొర్రెల మంద ప్రవేశంతో ముగిసింది. చివరి రోజున గొర్రెలకాపరి రూపంలో ఉన్న శివుడు మాయోపాయం పన్ని మాణిక్యాలదేవిని వివాహమాడే సన్నివేశాన్ని కళ్లకుకట్టినట్లుగా జాతరలో చూపించారు. ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే గట్టు జాతరకు ఈ ఏడాది భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. చివరి రోజున కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఓలింగా.. ఓ లింగా అంటూ భక్తులు చేసే నినాదాల జోరు కొనసాగింది. వసతుల లేమితో భక్తులు కొంత ఇబ్బందులు పడ్డారు. చైర్మన్ మసిముక్కు మట్టయ్య, బీజేపీ నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ పూజల్లో పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

మిర్యాలగూడ అర్బన్: టూటౌన్ పరిధిలోని 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ కోడిరెక్క రవికుమార్ తెలిపారు. హనుమాన్‌పేట ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందునా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. హనుమాన్‌పేట, రెడ్డికాలనీ, నాగార్జుననగర్, ముత్తిరెడ్డికుంట, అలాగే వన్‌టౌన్ పరిధిలోని ఈదులగూడ, గాంధీనగర్, షాబునగర్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కట్టంగూరు: మండలకేంద్రంలోని సాందీపని ఉన్నత పాఠశాలకు చెందిన 2005-2006 విద్యా సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు తోటి స్నేహితురాలికి రూ.60వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సిద్ధగోని మల్లేష్, సంతోష్‌రెడ్డి, అశోక్, సతీష్, రాజు, మధు, వెంకటేశ్వర్లు, అశోక్, మౌనిక, శిరీష, ప్రియాంక, సాధ్విమణి, నాగమణి ఉన్నారు.

హాలియా: హాలియా మునిసిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డిని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో తిరుమలగిరిసాగర్ వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బుర్రి రాంరెడ్డి, చంద్రశేఖర్‌యాదవ్, షేక్ ముస్తాఫా, కూన్‌రెడ్డి సంతోష్‌రెడ్డి, గజ్జల శివానందరెడ్డి పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువును పొడిగించినట్లు కొండమల్లేపల్లి ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమణమ్మ తెలిపారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని సూచించారు.

చండూరు: టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టెట్ పరీక్షకు ఒక్కో పేపర్‌కు రూ.200ల నుంచి రూ.1000 పెంచుతూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులపై ఆర్థిక భారం పడుతుందని అన్నారు.

దేవరకొండ: బీసీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు సదుపాయాలు కల్పించి వర్కర్ల సమస్యను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బొడిగె వెంకటేష్ ఒక ప్రకటనలో కోరారు. బీసీ వసతిగృహాల్లో వర్కర్లు సరిపడాలేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారని అన్నారు.

మునుగోడు రూరల్: అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని చొల్లేడు గ్రామానికి చెందిన ముడిగ చిన్న నర్సింహ కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు బుడిగపాక రవి, ఎంపీటీసీ వనం నిర్మల యాదయ్య, మాజీ సర్పంచ్ ముప్ప రవీందర్‌రెడ్డి, గోదల శంకర్‌రెడ్డి, వంగూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలం గురజాల గ్రామంలో విశాలాక్షి సమేత కాశీ విశ్వనాథేశ్వర స్వామి పునఃప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా 2వ రోజు మండపం దేవత పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. విగ్రహాల కలశ స్థాపనలు, గురప్రార్థనలు చేపట్టారు. కార్యక్రమంలో పురోహితులు కొడవకంటి సుబ్రహ్మణ్యశర్మ, కమిటీ సభ్యులు గుండా శ్రీనివాస్, మారం వేణుగోపాల్‌రెడ్డి, పొన్నెబోయిన వెంకన్న, నక్క మల్లేష్, కోక యాదయ్య, గూని మల్లయ్య, కమ్మంపాటి వీరయ్య, యాదయ్య పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఎం సీనియర్ నాయకుడు, అంతయ్యగూడెం గ్రామానికి చెందిన నన్నూరి అంజిరెడ్డిని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం పరామ ర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మన్నెం బిక్షం, భీమగాని గణేష్, దొంగరి వెంకన్న, సైదులు, శంకరయ్యచారి, బ్రహ్మచారి పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణ ప్రజలు ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ కోరారు. మంగళవారం కార్యాలయంలో మాట్లాడుతూ పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను బకాయి ఉన్న వ్యాపార, వాణిజ్య యజమానులకు నోటీసులు అందిస్తున్నామని, మూడు నోటీసుల అనంతరం ఆయా భవనాలను సీజ్ చేస్తున్నామన్నారు. ఆస్తి పన్ను బకాయిలున్న పారిశ్రామిక శిక్షణ కేంద్రం, డాక్టర్స్ కాలనీలోని పలు దుకాణాలను సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు వెంటనే ఆస్తి, నల్లా పన్ను చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని కోరారు.

మిర్యాలగూడ టౌన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫీజు తగ్గించాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. టెట్ కన్వీనర్ రాధారెడ్డికి వినతి పత్రం అందజేశారు. గతంలో ఒక్క పేపర్‌కు రూ. 100, రెండు పేపర్లకు రూ. 300 ఉండేదని, ప్రస్తుతం ఒక్కో పేపర్‌కు వేయి రూపాయల చొప్పున చెల్లించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారన్నారు. అంత ఫీజు చెల్లించలేని అభ్యర్థులు వేలల్లో ఉన్నారని, వారిని దృష్టిలో ఉంచుకుని ఫీజు తగ్గించాలని టెట్ కన్వీనర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో రవికిరణ్, మహేష్, వీటీ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ప్రభారి లచ్చిరెడ్డి కోరారు. పట్టణంలోని పీఎం విశ్వకర్మ యోజన కేంద్రాన్ని సందర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేసేలా కేంద్రం పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. అనంతరం పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుకూరి శ్యాం, నవీన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల శిబిరానికి ఎంపిక



హాలియా, మార్చి 26: హాలియాలోని వీఎస్ఆర్ పాఠశాలకు చెందిన ఎండీ. అఫ్రా జాతీయ స్థాయి కబడ్డీ పోటీల క్యాంపునకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ శివర్ల వెంకటయ్య తెలిపారు. ఈ నెల 31వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ తరుపున ప్రాతినిధ్యం వహించను న్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో కూడా పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు.